

సామాన్యుడికి అందని ద్రాక్షగా పుత్తడి

కొనడానికి వెనుకంజవేస్తున్న మహిళలు

# ఏమి కొనేటట్టు లేదు..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: బంగారం ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. పది గ్రాముల పుత్తడి ధర లక్ష రూపాయల మార్క్‌ను అధిగమించి సామాన్యుడికి అందని స్థాయికి చేరుకున్నది. దీంతో సామాన్యుడితో పాటు మహిళలు కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. అక్షయ తృతీయ, వివాహం సందర్భంగా బంగారాన్ని కొనుగోలు చేస్తుంటారు, కానీ ప్రస్తుతం ధర లక్ష స్థాయిలో ఉండటంతో మధ్యస్థాయి కుటుంబాలు వీటికి దూరంగా ఉంటున్నారు. ఇప్పటికే ఇతర ఖర్చులు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలపై బంగారం పిడుగు పడ్డట్టు అయిందని విశ్లేషకులు భావిస్తున్నారు. దేశ రాజధానిలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పది గ్రాముల బంగారం ధర రూ.1,800 ఎగబాకి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,01,600కి చేరుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టినప్పటికీ లక్ష రూపాయల దారిదాపుల్లోనే కొనసాగుతున్నది. పండుగ సీజన్‌తోపాటు కుటుంబ ఫంక్షన్లలో మహిళలు బంగారం కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు..ప్రస్తుతం దీని ధర రికార్డు స్థాయిలో పలకడంతో మహిళలు నిరుత్సాహానికి గురవుతున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు బంగారం ధరలు 29 శాతం లేదా రూ.22,650 పెరిగింది. ఈక్విటీ మార్కెట్లు, బాండ్ల కంటే పసిడి అత్యధిక రిటర్నులను పంచింది. దేశవ్యాప్తంగా ఉన్న మహిళ వద్ద 24 వేల టన్నుల బంగారం ఉన్నదని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజాగా అంచనాను విడుదల చేసింది.

*నా కూతురు పెళ్లి వచ్చే నవంబర్‌లో ఉన్నది. అకస్మాత్తుగా బంగారం ధర లక్ష రూపాయలు అధిగమించింది..ఇప్పుడు పుత్తడిని కొనుగోలు చేయడమెట్లా అని ఆలోచిస్తున్నాను.*

*- రూప, గృహిణి*

*‘ నా భర్త ప్రతి ఏటా బంగారాన్ని కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం దీని ధర గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో ఈ ఆభరణాలు నాకు గౌరవాన్ని, ఆర్థిక బలాన్ని ఇచ్చాయి’*

*- అర్చన దేశ్‌ముఖ్*

# విమాన చార్జీలకు రెక్కలు!

***అంతర్జాతీయ రూట్లలో 12 శాతం వరకు పెరగనున్న చార్జీలు***

***పాకిస్థాన్ గగనతలం మూసివేయడమే కారణం***



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: విమాన చార్జీలకు మళ్లీ రెక్కలు వచ్చాయి. పహెల్గాంపై తీవ్రవాదులు దాడుల నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. దీంతో పాకిస్థాన్ ఒక అడుగుముందుకేసి ఆ దేశ గగనతలాన్ని మూసివేసింది. దీంతో పాకిస్థాన్ గగనతలం నుంచి దేశీయ విమాన సర్వీసులు వెళ్లే అవకాశాలు లేకపోవడంతో చుట్టూ తిరిగి ప్రయాణించడంతో ఆయా విమానయాన సంస్థలు ప్రయాణికులపై భారం మోపడానికి సిద్ధమవుతున్నాయి. పాక్ గగనతలం నుంచి వెళ్లే యూరప్, ఉత్తర అమెరికా, మధ్యప్రాచ్యం వెళ్లే అంతర్జాతీయ ప్రయాణికుల విమాన చార్జీలు 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రతిగా పాకిస్థాన్ తన గగనతలంపై నిషేధం విధించడంతోపాటు సరిహద్దును మూసివేసింది.

**పెరగనున్న ప్రయాణ సమయం**

భారత్ నుంచి ఉత్తర అమెరికా, బ్రిటన్, యూరప్, మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లే అంతర్జాతీయ ప్రయాణికుల సమయం మరింత పెరగనున్నది. ఈ విషయాన్ని ఇప్పటికే ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు సమాచారాన్ని చేరవేశాయి. పాక్ గగనతలం మూసివేయడంతో అమెరికా, యూరోపియన్ దేశాలకు వెళ్లే విమాన ప్రయాణ సమయం 2 గంటల నుంచి 2.5 గంటల వరకు పెరగనున్నదని సీనియర్ పైలెట్ ఒకరు చెప్పారు. ఢిల్లీ, అమృత్‌సర్, జైపూర్, లక్నో, వారణాసి నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులపై ప్రభావం చూపుతున్నదని పేర్కొన్నారు. ప్రయాణ సమయం పెరగడంతో విమాన సంస్థలపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా టికెట్ చార్జీలను పెంచడానికి సమాయత్తమవుతున్నాయి. గగనతలం మూసివేయడంతో చమురు వినియోగం పెరగడం, నిర్వహణ ఖర్చులు అధికం కావడం కూడా ఇందుకు కారణమని ఆయన విశ్లేషించారు.

**ఎయిర్ ఇండియా దారిమళ్లింపు**

పాక్ గగనతలం మూసివేయడంతో ఎయిర్ ఇండియాకు చెందిన పలు విమాన సర్వీసులను దారి మళ్లించింది. ఉత్తర అమెరికా, బ్రిటన్, యూరప్, ఇతర దేశాలకు ప్రయాణించే అంతర్జాతీయ ఫ్లైట్ సర్వీసులు కొత్త రూట్‌లో వెళ్తున్నాయి. దీంతో వీటి ప్రయాణం సమయం మరో రెండు గంటలు పెరుగుతున్నదని తెలిపింది. మరో విమాన యాన దిగ్గజం ఇండిగో..అంతర్జాతీయ రూట్లలో నడిచే విమాన సర్వీసులపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నదని, ప్రయాణికులకు తమ పరిస్థితిని వివరించనున్నట్లు తెలిపింది. ప్రయాణికులకు కలిగించే అసౌకర్యాన్ని మేము అర్థం చేసుకోగలం..మీ గమ్యాన్ని చేర్చడానికి తమవంతుగా కృషి చేయనున్నట్లు ఎక్స్‌లో పేర్కొంది. ఈ రెండు సంస్థలతోపాటు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలకు చెందిన సర్వీసులు కూడా ఈ రూట్‌లో నడుస్తున్నాయి.





## ఎస్కార్ట్ ట్రాక్టర్లు ప్రియం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: వ్యవసాయ, నిర్మాణ రంగ పరికరాల తయారీ సంస్థ ఎస్కార్ట్ ..వచ్చే నెల నుంచి ట్రాక్టర్ల ధరలను పెంచబోతున్నట్లు ప్రకటించింది. ఎంత శాతం మేర పెంచుతున్న విషయాన్ని సంస్థ వెల్లడించలేదు. క్యూబాటో బ్రాండ్‌తో విక్రయిస్తున్న ట్రాక్టర్ల ధరలు వచ్చే నెల 1 నుంచి మరింత ప్రియంకాబోతున్నాయి. ఈ విషయాన్ని సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది.





## మారుతి రూ.135 డివిడెండ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీకి ఖర్చుల సెగ గట్టిగానే తగిలింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన ఒక్క శాతం తగ్గి రూ.3,911 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇది రూ.3,952 కోట్లుగా ఉన్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.38,371 కోట్ల నుంచి రూ.40,920 కోట్లకు చేరుకున్నట్టు వెల్లడించింది. గత త్రైమాసికంలో కంపెనీ నిర్వహణ ఖర్చులు రూ.37,585 కోట్లకు పెరగడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. అలాగే 6,04,635 వాహనాలను విక్రయించింది. మరోవైపు, 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,52,913 కోట్ల ఆదాయంపై రూ.13,955 కోట్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు, ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా సమావేశమైన కంపెనీ బోర్డు వాటాదారులు భారీ స్థాయిలో సంపదను పంచింది. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.135 డివిడెండ్‌ను ఇవ్వనున్నట్టు ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇచ్చిన రూ.125 కంటే ఇది అధికం. సంస్థ చరిత్రలో ఇంతటి స్థాయిలో డివిడెండ్ అందించడం కూడా ఇదే తొలిసారి కావడం విశేషం.

## ఎల్ఐసీ హెచ్ఎఫ్ వడ్డీరేట్ల తగ్గింపు

ముంబై, ఏప్రిల్ 25: గృహ రుణాలు అందించే దేశంలో అతిపెద్ద సంస్థల్లో ఒకటైన ఎల్ఐసీ హౌజింగ్ ఫైనాన్స్ రుణగ్రహీతలకు శుభవార్తను అందించింది. గృహ రుణాలపై వడ్డీరేటును పావు శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఇటీవల రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించిన నిర్ణయానికి అనుగుణంగా ఎల్ఐసీ హౌజింగ్ ప్రైమ్ లెండింగ్ రేటు(ఎల్‌హెచ్‌పీఎల్ఆర్)ను పావు శాతం తగ్గించింది. దీంతో గృహ రుణాలపై వడ్డీరేటు 8 శాతంతో ప్రారంభంకానున్నాయి. తగ్గించిన రేట్లు ఈ నెల 28 నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ తాజా నిర్ణయంతో గతంలో తీసుకున్న రుణాలతోపాటు కొత్తగా తీసుకునే రుణాలకు ఈ తగ్గింపు వర్తించనున్నదని ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ ఎండీ, సీఈవో త్రిభువన్ అధికారి తెలిపారు. దీంతో గృహ రుణాలు తీసుకునేవారి పెరిగే అవకాశం ఉండగా, గృహాలకు డిమాండ్ అధికంకానున్నదన్నారు.

**ఇండియన్ బ్యాంక్ కూడా..**

ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ బ్యాంక్ కూడా వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో గృహ రుణాలపై వడ్డీరేటు 8.15 శాతం నుంచి 7.90 శాతానికి తగ్గనుండగా, వాహన రుణాలపై వడ్డీరేటు 8.50 శాతం నుంచి 8.25 శాతానికి దిగిరానున్నది. దీంతో రుణ గ్రహీతల నెలవారి చెల్లింపులు తగ్గనున్నాయి. కెనరా బ్యాంక్ కూడా వడ్డీరేటును పావు శాతం కోత పెట్టింది. దీంతో 7.90 శాతం ప్రారంభంతో గృహ రుణాలు అందిస్తున్న బ్యాంక్..8.20 శాతానికి వాహన రుణాలు మంజూరు చేస్తున్నది. మరోవైపు, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్ల నుంచి 25 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది.

## రిలయన్స్ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను నికర లాభంలో 2.4 శాతం వృద్ధి చెంది రూ.19,407 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.14.34 కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో రూ.18,951 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.14 ఆర్జించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.4 లక్షల కోట్ల నుంచి రూ.2.6 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే రిలయన్స్‌కు చెందిన డిజిటల్ సేవల సంస్థ జియో నికర లాభం ఏడాది ప్రాతిపదికన 25.7 శాతం ఎగబాకి రూ.7,022 కోట్లకు చేరుకున్నది. ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చిన ఆదాయం 13.5 శాతం ఎగబాకి రూ.206.2కి చేరుకున్నది. ఏడాది క్రితం ఇది రూ.181.7 కోట్లుగా ఉన్నది. కంపెనీ ఆదాయం 17.7 శాతం వృద్ధితో రూ.33,986 కోట్లు ఆర్జించింది. మరోవైపు, గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ రూ.5.5 తుది డివిడెండ్‌ను ప్రకటించింది.

మార్కెట్లపై

# యుద్ధమేఘాలు

***ఒక దశలో 1,200 పాయింట్లు.. చివర్లో 590 పాయింట్లు డౌన్***

ముంబై, ఏప్రిల్ 25: దేశీయ స్టాక్ మార్కెట్లపై యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. భారత్-పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. నష్టాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 588.90 పాయింట్లు కోల్పోయి 79,212.53 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 207.35 పాయింట్లు పతనం చెంది 24,039.35 వద్ద ముగిసింది. పహల్గాంపై తీవ్రవాదులు దాడులు చేయడంతో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకోవడం మార్కెట్ సెంటిమెంట్‌ను నిరాశపరిచిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఐటీ రంగ సూచీ మినహా అన్ని రంగాల సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి.

- అదానీ పోర్ట్స్ షేరు 3.61 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటర్స్ షేర్లు రెండు శాతానికి పైగా కోల్పోయాయి.
- అలాగే టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, మారుతి, ఎస్బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్‌ఫార్మా, కొటక్ బ్యాంక్, ఎల్అండ్‌టీ, నెస్లె, టైటాన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లు కూడా నష్టాల్లో ముగిశాయి.
- టీసీఎస్, టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ 2.56 శాతం, మిడ్‌క్యాప్ కూడా 2.44 శాతం కోల్పోయింది.
- రంగాలవారీగా చూస్తే సర్వీసెస్ 3.11 శాతం నష్టపోగా, యుటిలిటీ 2.96 శాతం, రియల్టీ 2.87 శాతం, పవర్ 2.77 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.19 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.06 శాతం నష్టపోయింది. కానీ, ఐటీ రంగ సూచీ లాభాల్లో ముగిసింది.



**రూ.9 లక్షల కోట్లు ఆవిరి**

*స్టాక్ మార్కెట్లు వరుస నష్టాలతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. వరుసగా రెండు రోజుల్లో ఇన్వెస్టర్లు రూ.8.88 లక్షల కోట్ల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.8,88,975.14 కోట్లు కరిగిపోయి రూ.4,21,58,900.91 కోట్లు(4.93 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది.*

# సింగిల్ టేక్ రొమాంటిక్ సాంగ్



‘హిట్’ ఫ్రాంచైజీ నుంచి ఇప్పటివరకూ వచ్చిన రెండు సినిమాలు మంచి విజయాలను అందుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీ నుంచి రానున్న మూడో ప్రయత్నం ‘హిట్ : ది 3rd కేస్’. అగ్ర హీరో నాని కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం మే1న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాపై అంచనాలు కూడా భారీగానే ఉన్నాయి. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని ఓ రొమాంటిక్ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. రాఘవ్ రాసిన ఈ పాటను మిక్కీజే మేయర్ స్వరపరచగా అనిరుధ్ ఆలపించారు. పూర్తిగా ఒకే టేక్‌లో ఈ పాటను షూట్ చేయడం జరిగిందని మేకర్స్ చెబుతున్నారు. సినిమాలోని క్రైమ్ వరల్డ్ నేపథ్యానికి భిన్నంగా ఉండే సున్నితమైన విజువల్స్ ఈ పాటలో చూడొచ్చు. శ్రీనిధిశెట్టి పాత్రను కలవడానికి వెళ్తున్న నాని హ్యాపీ మూమెంట్‌ని ఆ పాట ఆవిష్కరిస్తున్నది. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, నిర్మాణం: వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్.



సినీరంగంలో తాను పడిన కష్టానికి ఫలితంగానే వేల మంది అభిమానుల్ని సంపాదించుకున్నానని, వాళ్లను దేవుడిచ్చిన వరంగా భావిస్తానని అగ్ర కథానాయిక సమంత చెప్పింది. చెన్నైలో ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహించిన కోలీవుడ్ గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో సమంత గోల్డెన్ క్వీన్‌గా అవార్డునందుకుంది. ఈ సందర్భంగా ఆమె తన కెరీర్‌తో పాటు కష్టకాలంలో వెన్నంటి

## అభిమానులు దేవుడిచ్చిన వరం!

వున్న ఆత్మీయుల గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురైంది. కేవలం ఏదో ఒక తప్పుడు నిర్ణయం వల్ల కెరీర్ ప్రభావితం అవుతుందన్నది అబద్ధమని, సరైన అవగాహన లేకుండా తీసుకునే ఎన్నో నిర్ణయాలు కెరీర్ గమనాన్ని నిర్దేశిస్తాయని తెలిపింది. తన ఆరోగ్యం బాగా లేనప్పుడు నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఎంతో కేర్ తీసుకున్నాడని, తమ అనుబంధానికి పేరు పెట్టలేనని సమంత ఎమోషనల్ అయింది. ‘కష్టకాలంలో రాహుల్ నావెంటే ఉన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. అతను నా స్నేహితుడు, సోదరుడు, కుటుంబ సభ్యుడు లేదా రక్త సంబంధీకుడా అని చెప్పలేను. అంతటి బలమైన అనుబంధం మాది’ అని సమంత పేర్కొంది. ప్రస్తుతం సమంత హిందీలో ‘రక్త్ బ్రహ్మాండ్’ అనే వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నది.

చిత్రం

# అఖండ తాండవం సెప్టెంబర్‌లోనే..



సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో బాలకృష్ణ ‘అఖండ 2- తాండవం’ ముందు వరుసలో ఉంటుంది. హ్యాట్రిక్ హిట్స్ సింహా, లెజెండ్, అఖండ చిత్రాల తర్వాత బాలయ్య, బోయపాటిశ్రీను కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ‘అఖండ-2’పై అంచనాలు ఆకాశమంత ఎత్తులో ఉన్నాయి. పైగా బాలకృష్ణ కెరీర్‌లో వస్తున్న తొలి పానిండియా సినిమా ‘అఖండ 2’ కావడం విశేషం. చిత్ర నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట దాదాపు 200కోట్ల భారీ వ్యయంతో ఈ సినిమాను నిర్మిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పక్కా ప్లానింగ్‌తో శరవేగంగా జరుగుతున్నది. ఇందులో అఖండ రుద్ర సికిందర్ అఘోరాగా బాలయ్య నటవిరాట్ స్వరూపాన్ని చూస్తారని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమా కొన్ని కారణాలవల్ల దసరా రేస్ నుంచి తప్పుకుందని, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుందంటూ పలు రూమర్లు సోషల్ మీడియాలో వినిపించాయి. వాటన్నింటికీ చెక్ పెడుతూ శనివారం బోయపాటి పుట్టినరోజు సందర్భంగా ఎక్స్‌లో చిత్ర నిర్మాతలు ఓ పోస్ట్ పెట్టారు. ‘థియేటర్లలో మాస్ హిస్టీరియాను సృష్టించే క్రియేటర్.. మా ‘అఖండ 2’ దర్శకుడు బోయపాటి శ్రీనుకు పుట్టినరోజు శుభాకాంక్షలు. సెప్టెంబర్ 25న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా ‘అఖండ 2 - తాండవం’ విడుదల కానుంది’ అనేది ఈ పోస్ట్ సారాంశం. దీంతో ‘అఖండ 2’ విడుదలపై వస్తున్న రూమర్లన్నింటికీ ఫుల్‌స్టాప్ పడింది. అంటే.. థియేటర్లలో అఖండ తాండవం సెప్టెంబర్‌లోనే అన్నమాట.

## మా కాంబినేషన్‌లో హ్యాట్రిక్ హిట్



‘ప్రియదర్శి వైవిధ్యమైన నటుడని మా అందరి నమ్మకం. ఇదే విషయాన్ని నేను చాలాసార్లు చెప్పాను. ఇప్పుడు ప్రేక్షకులు అదేమాటంటున్నారు. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌గారితో ఈ సినిమా ద్వారా హ్యాట్రిక్ హిట్‌కొట్టడం ఆనందంగా ఉంది.’ అన్నారు దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఆయన నిర్దేశకత్వంలో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన ‘సారంగపాణి జాతకం’ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాత. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడారు. సకుటుంబ సపరివార సమేతంగా థియేటర్లలో చూసి ఆనందించాల్సిన చిత్రమిదని ఆయన అన్నారు. వైజాగ్‌లో వేసిన ప్రీమియర్‌షోలకే పాజిటివ్ వైబ్స్ వచ్చాయని, బుక్‌మై షోలో సినిమా ట్రెండ్ అవుతున్నదని, అన్ని రివ్యూస్ అద్భుతంగా వచ్చాయని హీరో ప్రియదర్శి ఆనందం వ్యక్తం చేశారు. ‘సారంగపాణి’ ప్రభంజనం ఇప్పుడే మొదలైందని, మౌత్‌టాక్‌తో మరింత ముందుకు వెళ్తుందనే నమ్మకం ఉందని, ఈ విజయంతో టీమ్ మొత్తం హ్యాపీగా ఉన్నామని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సక్సెస్‌మీట్‌లో రూపా కొడవయూర్, అవసరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో

# ‘క’ నామినేట్



నటుడు కిరణ్ అబ్బవరం నటించిన ‘క’ చిత్రానికి అరుదైన గౌరవం లభించింది. 15వ ప్రతిష్ఠాత్మక ‘దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్’లో ఈ సినిమా నామినేట్ అయ్యింది. ఉత్తమ చిత్ర విభాగానికి ‘క’ నామినేట్ అయినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఢిల్లీ వేదికగా ఈ నెలాఖరున జరిగే వేడుకల్లో విజేతలు పురస్కారాలు అందుకోనున్నారు. నూతన దర్శకులు సుజిత్, సందీప్ దర్శకత్వంలో చింతా గోపాలకృష్ణరెడ్డి నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది విడుదలై అఖండ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. నయన్ సారిక, తన్వీ రామ్ ఇందులో కథానాయికలు. ఫాంటసీ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని డాల్బీ విజన్ ఆటమ్స్ టెక్నాలజీతో మేకర్స్ తెరకెక్కించారు. ఇదో విభిన్నమైన కథ. కర్మసిద్ధాంతం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. సగటు ప్రేక్షకునికి ఆద్యంతం సినిమా చూస్తే తప్ప అంతుచిక్కని స్క్రీన్‌ప్లేతో దర్శకులు సుజిత్, సందీప్ ‘క’ను మలిచారు. వాణిజ్య పరంగా 50కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. దీనికి కొనసాగింపు కూడా ఉంటుందని, తొలి పార్ట్‌ని మించేలా ‘క -2’ తెరకెక్కిస్తామని దర్శకులు చెబుతున్నారు.



**తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (టీఎఫ్‌టీడీడీఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు సాయిరాజు రాజంరాజు అలియాస్ ముక్కురాజు మాస్టర్ విగ్రహావిష్కరణ వేడుక ఇటీవలే హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. టీఎఫ్‌టీడీడీఏ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని ప్రముఖ దర్శకనిర్మాత ఆర్.నారాయణమూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ఛాంబర్ ప్రధాన కార్యదర్శి దామోదరప్రసాద్, తమ్మారెడ్డి భరద్వాజ, వల్లభనేని అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.**

## రాజశేఖర్ లబ్బర్ బంతి



హీరోలందరి అభిమానులకూ ఇష్టుడైన నటుడు డా.రాజశేఖర్. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడైతే ఆ పరిస్థితి లేదు. జనరేషన్ మారింది. కొత్త నీరు వచ్చింది. పాత కథలకు కాలం చెల్లింది. ఆడియన్స్ అభిరుచి మారింది. దాంతో ఈ జనరేషన్‌కి తగ్గట్టు తనను తాను మలుచుకునే పనిలో ఉన్నారు రాజశేఖర్. సరైన సెకండ్ ఇన్నింగ్స్ కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారాయన. అందులో భాగంగానే తమిళ సూపర్‌హిట్ ‘లబ్బర్ పందు’ చిత్రం రీమేక్ హక్కుల్ని సొంతం చేసుకున్నారట. ‘లబ్బర్ పందు’ అంటే తెలుగులో ‘లబ్బర్ బంతి’ అని అర్థం. ఇది ఓ ఆడపిల్ల తండ్రి కథ. ఆ తండ్రికి క్రికెట్ అంటే ఇష్టం. తన కూతురు ఓ అబ్బాయిని ప్రేమిస్తుంది. ఆ కుర్రాడికి కూడా క్రికెట్ అంటే ఇష్టం. ఈ విధంగా క్రీడా నేపథ్యంలో సరదాగా, భావోద్వేగాల మధ్య ఈ ప్రేమకథ సాగుతుంది. ఇందులో పెళ్లీడు కూతురుకి తండ్రిగా వయసుకు తగ్గ పాత్రలో నటించేందుకు రాజశేఖర్ సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ సినిమా దర్శకుడు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు తదితర వివరాలు త్వరలో వెల్లడికానున్నట్టు తెలుస్తున్నది.



## సైన్స్ ఫిక్షన్ ‘కలియుగమ్ 2064’

శ్రద్ధాశ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటించిన సైన్స్ ఫిక్షన్ అడ్వెంచరస్ చిత్రం ‘కలియుగమ్ 2064’. ప్రమోద్ సుందర్ దర్శకుడు. కన్నడ, తెలుగు భాషల్లో రూపొందిన ఈ చిత్రాన్ని కె.ఎస్.రామకృష్ణ నిర్మించారు. మే 9న విడుదలకానుంది. తెలుగులో మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తున్నది. శుక్రవారం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఆవిష్కరించారు. 2064లో ఏర్పడే విపత్కర పరిస్థితుల్లో మనుగడ కోసం మానవులు చేసే పోరాటం నేపథ్యంలో ట్రైలర్ ఆసాంతం ఆసక్తికరంగా సాగింది. తెలుగు ప్రేక్షకులకు ఫ్యూచరిస్టిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే చిత్రమిదని మేకర్స్ తెలిపారు.



## ‘సింగిల్’ వచ్చేది ఆ రోజే..

వరుస విజయాలతో జోష్‌మీదున్నారు యువహీరో శ్రీవిష్ణు. ఆయన నటిస్తున్న తాజా రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘సింగిల్’. కార్తీక్ రాజు దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని, ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, ఆద్యంతం హాస్యంతో అలరించే చిత్రమిదని మేకర్స్ తెలిపారు. కేతికశర్మ, ఇవానా, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాతలు: విద్యా కొప్పినీడి, భానుప్రతాప్, రియాజ్ చౌదరి, రచన-దర్శకత్వం: కార్తీక్‌రాజు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.